ఉద్యోగ నియామక పత్రం అందజేత

విశాలాంధ్ర-ఫిరంగిపురం: కారుణ్య నియామకం క్రింద మండల కేంద్రమైన ఫిరంగిపురం జెండా చెట్టు సమీపంలో ముస్లీం పేటకు చెందిన షేక్ షబానాకు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా గుంటూరులో తన కార్యాలయం నందు సోమవారం ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. షబానా భర్త షేక్ మహబూబ్ సుభానీ ఫిరంగిపురం మండలం గరుడాచల్‌పాలెంలో ఉపాధ్యాయుడుగా పని చేస్తూ కరోనా కరోనాతో మృతి చెందాడు. కారుణ్య నియామకం క్రింద సుభానీ భార్యకు నర్సరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. తాడికొండ వైసీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, ఫిరంగిపురం జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలు తనిఖీ చేసిన డీఐ

విశాలాంధ్ర-గుంటూరు : చేబ్రోలు మండలంలోని వడ్లమూడి, చేబ్రోలు గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికలు, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం, జగనన్న గోరుముద్ద విద్యార్థులతో పాటు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఉపాధ్యాయులందరూ పాఠ్యప్రణాళికలను రూపొందించుకోవాలని, విద్యార్థుల వివరాలు సమగ్రంగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహజబీన్, షకీలా, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల గోడప్రతుల ఆవిష్కరణ

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి దేవాలయ అధికారులతో, కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, మెడికల్, ఆర్టీసీ, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారుల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణం, రథోత్సవం కార్యక్రమాలకు ఆయా శాఖల సమన్వయంతో భక్తులకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా కావలసిన ఏర్పాట్లను కచ్చితంగా చేస్తామని అన్నారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవ ప్రాంగణాన్ని పరిశీలించి కల్యాణోత్సవం నాటికి పూర్తిస్థాయిలో కల్యాణ ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని ఎమ్మెల్యే ఆర్కే దేవాలయ అధికారులకు సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో దేవాలయ పరిసరాలలో రాజకీయ నాయకుల ఫొటోలతో బ్యానర్లు కట్టవద్దని భక్తులకు స్వాగతం పలికే వ్యాపార ప్రచార బ్యానర్లు, క్లాత్ బ్యానర్లు మాత్రమే కట్టాలని ఎమ్మెల్యే ఆర్కే దేవాలయ అధికారులకు సూచనలు చేశారు.

కేఎల్‌యూ విద్యార్థుల కెరీర్ గైడెన్స్

విశాలాంధ్ర-తాడేపల్లి : స్థానిక కేఎల్ విశ్వ విద్యాలయం విద్యార్థులు సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం చిర్రావూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగ అధిపతి డాక్టర్ సిహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును బాగుండేలా చక్కగా చదువుకోవాలని సూచించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ రమ్య మాట్లాడుతూ జీవితంలో ఉన్న శిఖరాలు అధిరోహించాలంటే పదో తరగతి తర్వాత ఎటువంటి కోర్సులు తీసుకుంటే ఎలాంటి ఉద్యోగాల్లో సెటిల్ అవుతారనే అంశాలను వివరించారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తల్లి దండ్రులు తమ పిల్లలు మంచి కోర్సులు చదువుకునేటట్లు చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు సీఈఏ వారిని వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈఏ ప్రో ఇంచార్జి డాక్టర్ గోపికృష్ణ, కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సమన్వయకర్తగా వ్యవహరించారు. సీఈఏ వలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాలలో సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ హైస్కూల్‌లో పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ దాన బోయిన సంతోష రూపా వాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ కార్యక్రమా నికి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో కుసుమ శ్రీదేవి అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులు జగనన్న పోషకాహారాన్ని ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బ్యాగులు, షూస్, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాయ్స్ ప్రధానోపాధ్యాయులు బాలసుందర్రావు, జిల్లా పరిషత్ బాలికల ప్రధానోపాధ్యాయులు భారతి, సతీష్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి..

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సీఎఫ్ఎంఎస్‌లో 010 పద్దు ద్వారా జీతం పొందే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఏపీఎఫ్ ఆర్ఎస్‌యాప్‌లో నమోదు అయి ముఖ ఆధారిత హాజరు వేయాలని సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఏపీఎఫ్ఆర్ఎస్‌యాప్‌పై జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అందరు డ్రాయింగ్ అండ్ డిస్బరింగ్ అధికారులు తమ పరిధిలో రెగ్యులర్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను యాప్‌లో ఎన్రోల్ చేయాలన్నారు. జిల్లాలో ఎంత మంది డీడీఓలు ఉన్నారు, ఏ శాఖలో ఎంత మంది ఉద్యోగులు యాప్‌లో ఎన్రోల్ అయింది, ఇంకా ఎంత మంది ఎన్రోల్ అవవలసి ఉన్నది అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. యాప్‌లో ఎన్రోల్‌మెంట్‌కు, అటెండెన్స్‌కు సంబంధం లేదని తెలిపారు. దివ్యాంగులకు ముఖ ఆధారిత హాజరు నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. సీఎఫ్ఎంఎస్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌తో ఎంత మంది అయిన ఎన్రోల్ అవ్వవచ్చని, సీఎఫ్ఎంఎస్‌తో లింక్ అయి మొబైల్ నెంబర్ అందుబాటులో లేని ఎడల సిఎఫ్ఎంఎస్‌లో కొత్త మొబైల్ నెంబర్‌తో ఎన్రోల్ చేసుకోవాలన్నారు. ఒకే డీడీఓ రెగ్యులర్, ఇన్‌చార్జ్‌గా ఉన్న చోట ఇన్‌చార్జ్ కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరు వేయడానికి ఎన్రోల్ అవడం లేదని, అలాగే గ్రంథాలయాలు, యూనివర్శిటీలు పీడీ అకౌంటు కలిగి ఉన్నాయని, వారు ఏ విధంగా ఎన్‌రోల్ చేసుకోవాలని అని సందేహాలను అధికారులు సంయుక్త కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఎన్ఐసీ జిల్లా అధికారి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించు కోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ కే చంద్రశేఖర రావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్.ఇ ఆర్అండ్‌బి లలిత, జిల్లా మత్స్య శాఖాధికారి రంగనాథ బాబు పాల్గొన్నారు.

జాబ్ చాట్ ప్రకారం విధులు నిర్వహించాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జాబ్ చాట్ ప్రకారం ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. తొలుత సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ మాట్లాడుతూ అడ్మిన్ కార్యదర్శులు ఆస్తి, ఖాళీ స్థల పన్నులను నూరు శాతం వసులు చేయాలని, ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ రీసర్వే పూర్తి చేయాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో బకాయిలున్న మీడియా డివైజ్ డిస్ప్లే ఫీజులను వసులు చేయాలన్నారు. ఏఎన్ఎంలు ఆయుష్మాన్ భారత్ సర్వే వేగంగా పూర్తి చేయాలని, ఎమినిటి సెక్రెటరిలు ప్రతి రోజు 10 త్రాగునీటి శాంపిల్స్ తీయాలని ఆదేశించారు. అనంతరం గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్స్ అప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 35 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.
అలాగే ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ కార్మికురాలి భర్తకు ఎక్స్ గ్రేషియా చెక్‌ని సోమవారం నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో కమిషనర్ అందించారు.

నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో మంగళగిరి వాలీబాల్ లీగ్

విశాలాంధ్ర-మంగళగిరి : నియోజకవర్గ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే నారా లోకేష్ లక్ష్యమని గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్లో సోమవారం ఉదయం మంగళగిరి వాలీబాల్ లీగ్ పేరుతో ఈ నెల 22 నుంచి నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న వాలీబాల్ టోర్నమెంట్‌లో భాగంగా పాల్గొననున్న 40 జట్ల మధ్య డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ లోకేష్ సహకారంతో ఈ నెల 22 నుంచి 26 వరకు మంగళగిరి పట్టణ బైపాస్ వెంబడి ఉన్న భోగి ఎస్టేట్లోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో మంగళగిరి వాలీబాల్ లీగ్ పేరుతో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లోకేష్ లక్ష్యంగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళగిరి వాలీబాల్ లీగ్‌లో విజేతగా నిలిచిన మొదటి జట్టుకు రూ.50 వేల నగదు, రెండవ జట్టుకు రూ.30 వేలు, మూడో జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతిని అందజేస్తామని చెప్పారు. మొత్తం 5 దశల్లో నిర్వహించనున్న మ్యాచ్‌లకు డ్రా నిర్వహించి, లీగ్‌లో మూడు దశల్లో తలపడనున్న పోటీ జట్లను తెలియజేశారు. గత నెలలో మంగళగిరి ప్రీమియర్ లీగ్ పేరిట క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన తెలుగు యువత పర్యవేక్షణలో మంగళగిరి వాలీబాల్ లీగ్‌ను కూడా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వ్యవహారాల సమన్వయకర్త నందం అబద్దయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, మండల పార్టీ అధ్యక్షులు తోట పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: విద్యార్థులు నేడు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కెరీర్‌ను మలుచు కోవాలని వక్తలు అన్నారు. సోమవారం స్థానిక పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజిమెంట్ కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖా నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ అఫైర్స్, గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మానేజిమెంట్ ప్రిన్సిపాల్ బిళ్ళా కిరణ్ కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అకడమిక్‌గా వ్యక్తిగతంగా ఎలా వ్యవహరించాలనే విషయంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కాలానుగుణంగా విద్యార్థులు తమ మైండ్ సెట్‌ను మార్చుకుంటూ ముందుకు వెళ్లి కెరీర్ను తీర్చిదిద్దుకోవాలని అన్నారు. అధ్యాపకులు చెప్పే విషయాలను ఆకలింపు చేసుకొని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలన్నారు. స్టెప్ మేనేజర్ రాధిక, డా.రవి కుమార్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కొండయ్య, వివిధ డిపార్ట్‌మెంట్‌ల ఇన్‌ఛార్జ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎంపికలో ఎస్టీలకు సామాజిక న్యాయం ఎక్కడ ?

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైసీపీ ప్రభుత్వం విడుదలచేసిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో గిరిజనులకు ఎక్కడ న్యాయం జరిగిందని జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు అధికారం రావాలన్నదే సీఎం జగన్ లక్ష్యం అని చెప్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి అభ్యర్థుల ఎంపికలో గిరిజనులకు సామాజికన్యాయం ఎక్కడ జరిగిందని నిలదీశారు. 58 మంది శాసనమండలి సభ్యులకు గానూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క గిరిజనుడిని ఎమ్మెల్సీగా ఎంపిక చేయలేదన్నారు. గిరిజన అభ్యర్థులను ఎందుకు తీసుకోలేదు...? అర్హులు లేకనా... లేక గిరిజనులు అసమర్థులనా... సజ్జల సమాధానం చెప్పాలన్నారు. కాళీ అవ్వడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఎప్పుడో ఎంపికచేయబోయే గవర్నర్ కోటాలో కుంభ రవిబాబుకు ఎస్టీకి ఇవ్వబోతున్నామని విడుదల చేసిన జాబితాలో కలిపి ఇవ్వడం చూస్తే, ఎప్పుడో పుట్టబోయే బిడ్డకు ముందుగానే పెరుపెట్టినట్లు వైసీపీ ప్రభుత్వం తీరు ఉందని ఎద్దేవా చేశారు. గిరిజనుల పట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్టీ రిజర్వేషన్ 6శాతం ప్రకారం లేదా 24 జీఓ ప్రకారం 58 ఎమ్మెల్సీ స్థానాలకుగాను నలుగురు ఎస్టీలను శాసనమండలికి ఎంపికచేసి అప్పుడు వైసీపీ ప్రభుత్వం సాధికారత, సామాజిక న్యాయం గురించి మాట్లాడాలని ప్రభుత్వాన్ని నిలదీశారు.

తాగునీటి కోసం దళితుల ధర్నా

విశాలాంధ్ర-తెనాలి రూరల్ : కొలకలూరు దళితవాడ తాగునీటికి కటకటలాడుతుంది. అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా కప్పదాటు వ్యవహారంతో మొహం చాటేస్తున్నారని సోమవారం దళితులు ఖాళీ బిందెలతో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఉన్నం రాంబాబు మాట్లాడుతూ గతంలో కలుషిత నీరు ప్రభావం వల్ల ఒకరు చనిపోయారని, దళితవాడ అంటే అధికారులకు లెక్క లేకుండా పోయిందని, తమను ఇంత చిన్నచూపు చూడటం దుర్మార్గమైన విషయమని ఇంకా ఎంతమంది చనిపోవాలని, వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ బాధితులకు హామీ ఇస్తూ ఈవో వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కొత్త పైపు లైను ద్వారా నీటిని అందిస్తామని అన్నారు. దీంతో దళితులు శాంతించి ధర్నా విరమించారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కొలకలూరి క్రిష్, కోపల్లె శ్రీను, సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు మోదుకూరి దావీదు, గొరిగపూడి కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

24,25 తేదీల్లో హిందూ ఫార్మశీలో 'స్పోర్ట్స్ మీట్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 24, 25 తేదీలలో స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మశీ కళాశాలలో 'అంతర కళాశాలల స్పర్థ 4వ హెచ్‌సీఓపీ స్పోర్ట్స్ మీట్-2క23 జరుగుతుందని ఆ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో వారు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గుంటూరు, కృష్ణ, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని వివిధ ఫార్మశీ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. 24న జరిగే ప్రారంభోత్సవానికి ఏఎన్‌యూ గుంటూరు కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జాన్సన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, అలాగే 25న జరిగే ముగింపు కార్యక్రమానికి ఏఎన్‌యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ రానున్నట్లు చెప్పారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, చెస్, కేరమ్స్, షాట్‌పుట్ లాంటి ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు మెడల్స్, సర్టిఫికెట్స్ ముఖ్య అతిధులు చేతులు మీదుగా ఇవ్వనున్నట్లు చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతరామయ్య, ఫిజికల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ సీహెచ్ అజిత్‌బాబు తదితరులు ఉన్నారు.

స్పందనకు 128 అర్జీలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: కలక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్వో చంద్ర శేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామి రెడ్డి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 126 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలకు తప్పకుండా రశీదులు ఇవ్వాలని క్షేత్రాధికారులను ఆదేశించారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమానికి ముందు డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు, మండల అధికారులతో మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంలో అందే ప్రతి అర్జీ ముట్టినట్లుగా రశీదు తప్పక ఇవ్వాలన్నారు. మున్సిపల్, పంచాయితీ రాజ్ శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా రీ ఓపెన్ అవుతున్నట్లు పరిశీలనలో తెలిసిందన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్ళకుండా ఎప్పటికప్పుడు సకాలంలో మనసు పెట్టి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, డ్వామా, మెప్మా పీడీలు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, వెంకటనారాయణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏపీపీ సునీల్ కుమార్‌కు అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర-తెనాలి : సీనియర్ ఏపీపీ సునీల్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం సునీల్ కుమార్ వివరాలు వెల్లడిస్తూ.. తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఏపీపీగా.. తెనాలి ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సీనియర్ ఏపీపీగా అదనపు బాధ్యతలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న ఏపీపీ శివలీల అనంతపురంలో పోలీసు ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ నిమిత్తం వెళ్లారని తెలిపారు. అందువలన రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుకి మూడున్నర నెలలు సునీల్ కుమార్ ఏపీపీగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గృహ సారథులే జగనన్న రథ సారథులు: కత్తెర సురేష్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: గృహ సారథులే జగనన్న రథ సారథులని తాడికొండ వైసీపీ సమన్వకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన ఫిరంగిపురం సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో సోమవారం గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులకు జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. లక్షల కుటుంబాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన వైసీపీ ప్రభుత్వం పాలన తీరును నాయకుల సహకారంతో కన్వీనర్లు, గృహ సారథులు ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. రాష్ట్రాన్ని ఇంత అభివృద్ధిపథంలో నడిపిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని నూటికి నూరు శాతం మార్కులతో గెలిపించే బాధ్యత ప్రతి ఒక్క నాయకునిపై ఉందన్నారు. తాడికొండ వైసీపీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని గెలిపించకపోతే మన చెట్టు కొమ్మను మనమే నరుక్కున్నట్లేనని సమావేశంలో గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి గాంధి మార్గంలో పాద యాత్ర చేసి కాంగ్రెస్‌పార్టీకి పునర్జన్మనిచ్చారని ఈ నాడు రాజశేఖర్‌రెడ్డి మార్గంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాద యాత్ర చేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించి రాష్ట్రాన్ని సుపరిపాలనగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. కన్వీనర్‌లు, గృహ సారథులు, నాయకులు గత ప్రభుత్వాలకు, నేటి ప్రభుత్వాలకు ఉన్న వ్యత్యాసాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సిపి గెలుపే లక్ష్యంగా క్రియాశీలక పాత్ర పోషించాలని బ్రహ్మానందరెడ్డి కోరారు. కార్యక్రమంలో జెసియస్ కో-ఆర్డినేటర్ రవీంద్రరెడ్డి, ఎంపిపి షహెలా నర్గీస్, జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ, వైస్ ఎంపిపి గుమ్మడి చంద్రం, మండల వైసీపీ నాయకులు మార్పుల శివరామిరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పెరికల మరియబాబు, జేమ్స్, సర్పంచ్ మేడా బాబు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటీసిలు, వైసీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
ఆర్.ఓ.సి.నెం.1398/2020/ఇ1 తేది: 20-02-2023
నిట్ నెం.65/జె.టీ.ఓ/2022-23
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధులు మరియు 15వ ఆర్థికసంఘ నిధుల క్రింద మొత్తము 18 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు - 18 నెం.లు పని నెం. 01 నుండి 18 లకు :	అంచనా వ్యయము రూ.252.63 లక్షలు
1. టెండరు షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.21-02-2023 ఉదయము గం. 11.00 ని.ల నుండి
2. టెండర్లు షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.24-02-2023 ఉదయము గం. 11.00 ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.24-02-2023 మధ్యాహ్నము గం.2.00 ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం.9849907303
సం/- యు.శారదా దేవి, కమిషనరు
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

బహిరంగ ప్రకటన
నాక్లయింటు అయిన మందడపు చంద్రశేఖర్, తండ్రి. అనంత రామయ్య, ఫ్లాట్ నెం.317, వెంకటరమణ ఎస్టేట్, గుంటూరు వాస్తవ్యులైన వారి వద్ద నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నాక్లయింట్ యెట్లల శివ శంకర రెడ్డి గారి వద్ద నుండి వెంకట రమణ ఎస్టేట్‌లోని ఫ్లాట్ నెం.317 కొనుగోలుచేసి తన పేరుమీద రిజిష్టర్ చేయించుకొనిఉన్నాడు. దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు అయిన 13322/2004, 13331/ 2004 ది.08-10-2004 గుంటూరు రిజిష్టర్ ఆఫీసు నందు రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు నాక్లయింటుకు యిచ్చియున్నారు. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు ఫోటోస్టాట్ కోసం బృందావన్ గార్డెన్స్‌కు వెళ్ళి ఫోటోస్టాట్ తీసు కొని ఇంటివద్దకు వచ్చే దారిలో పోయినవి. కనుక పైఉదహరించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల నాక్లయింటుకు గాని ఈ క్రింది అడ్రస్‌కు గాని ఇవ్వగలరు.
యడ్లపల్లి కోటేశ్వరరావు, అడ్వకేట్,
2/18 బ్రాడీపేట, గుంటూరు.సెల్: 9397107449

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వండి: ముస్తఫా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 17వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే ముస్తఫా పాల్గొని గడప గడపకు తిరిగి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శివారు ప్రాంతంలోని గాంధీనగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండటం...వ ఐరుగుతో నిండి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని గాంధీనగర్ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గాంధీనగర్ శివారు కాలనీల్లో రోడ్లు, కాల్వలు లేవని ఎమ్మెల్యేకు తెలియజేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ముస్తఫా సైడు కాల్వల నిర్మాణాలకు ఇటీవల శంఖు స్థాపన చేశామన్నారు. దశలవారీగా రోడ్లు నిర్మిస్తామని, ఖాళీ స్థలాల యజ మానులకు హెచ్చరిక నోటీసులు జారీ చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారిచేత దరఖాస్తులు చేయించి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫర్హాన, తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, డివిజన్ కన్వీనర్ యాదాల చిన్న, వైసీపీ నాయకులు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, గుదె నాగేశ్వరరావు, గోపీనాయుడు, అంకమ్మరావు, కొండలరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన బొమ్మి ఇశ్రాయేల్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు సోమవారం సీఎం కార్యాలయం వద్ద కలిసి అభినందనలు తెలియజేశారు. రాజకీయాలలో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న సమర్థత కలిగిన యువతలో నాయకత్వాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఉన్న బాపట్ల పార్లమెంటు సభ్యుడు నందిగం సురేష్ ఎమ్మెల్సీ పదవికి బొమ్మి ఇశ్రాయేల్ పేరును పరిశీలించాలని కోరగా స్పందించిన సీఎం వైఎస్ జగన్ ఇశ్రాయేల్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించటం హర్షించదగ్గ విషయమన్నారు. సమాజంలో అట్టడుగు స్థాయిలో వెనుకబాటుతనం అనుభవిస్తూ సాధారణ జీవితం జీవిస్తూ నిరంతరం పేద వర్గాల వారి హక్కుల కోసం.. ఆత్మగౌరవం కోసం శ్రమిస్తున్న బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ పదవి రావడానికి చొరవ చూపిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

బేజాత్‌పురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర-తాడికొండ : మండల పరిధిలోని బేజాతపురం గ్రామంలో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు టీడీపీ గ్రామస్తులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంపై మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శనాస్త్రాలు సంధించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వడ్లమూడి సుదీర్, ఫరీద్, అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబద్ధతకు దక్కిన గౌరవం

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా 'చంద్రగిరి ఏసురత్నం'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో గుంటూరు వ్యవ సాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నంకు చోటు దక్కింది. మొత్తం 18మంది గల ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబి తాలో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా చంద్రగిరికి అవకాశం కల్పించారు. బీసీ (వడ్డెర)సామాజిక వర్గానికి చెందిన ఏసురత్నంను ఎమ్మెల్సీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం పట్ల ఆ సామాజిక వర్గం ప్రజలు, జిల్లాలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు. పోలీస్ శాఖలో డీఐజీగా పని చేసిన చంద్రగిరి ఏసురత్నం వైసీపీలో చేరారు. 2019 ఎన్నికలలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంతరం వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన స్థానిక నాయకత్వాన్ని కలుపుకుని సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన సమర్థత గుర్తించిన అధిష్టానం నామినేటెడ్ పదవుల భర్తీ సమయంలో ఆసియాలోనే అతిపెద్ద గుంటూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఆయనకు అప్పగించింది. తన పదవి ముగిసినప్పటికీ తిరిగి చైర్మన్‌గా తననే కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతానికి ఆయన గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కావటంతో ఆయా స్థానాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఎమ్మెల్సీ జాబితాలో చంద్రగిరి ఏసు రత్నంకు స్థానం కల్పించింది. ఆయన నిబద్ధతను గుర్తించి ప్రభుత్వం ఎమ్మెల్సీగా ప్రకటించటం పట్ల చంద్రగిరి వర్గం హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన అనుచర గణం ఇన్నర్‌రింగ్ రోడ్డులో చంద్రగిరి ఏసురత్నంకు ఘన స్వాగతం పలికి గుంటూరు మార్కెట్ మీదుగా శంకర్ విలాస్, లాడ్జి సెంటర్, కొరిటిపాడు సెంటర్ మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రగిరి మాట్లా డుతూ తనకు ఈ పదవి రావటం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, వైసీపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బహిరంగ ప్రకటన
నా క్లయింటు గుంటూరు సిటి, కొరిటెపాడు, నాయుడుపేట 4వ లైను, డోరు నెం.4-9-37/ఎ కాపురస్తులు మిట్నాల కేశవులు గారి భార్య మిట్నాల శేషారత్నం గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.
నా క్లయింటు పేరిట గుంటూరు సిటీ, కొరిటెపాడు 4వ లైను టియస్ నెం.515 నందలి 48 చదరపు గజముల స్థలము అందలి డోరు నెం.4-9-37/ఎ రుగా గల ఆర్‌సిసి డాబా, రేకుల యిల్లు కలదు. సదరు ఆస్తి నా క్లయింటు పేరిటకు ది.04.02.2008న శ్రీ కొరిటెపాడు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దఖలు దస్తావేజు నెం.368/2008 రుగా రిజిష్టరు కాబడినది. అనంతరం సదరు దస్తావేజులో విస్తీర్ణం సవరణ చేసి మరలా సవరణ దస్తావేజు నెం.4122/2013 రుగా రిజిష్టరు చేయించడమైనది.
కాగా సదరు సవరణ దస్తావేజు నెం.4122/2013, లింకు దస్తావేజులు నెం.1081/2008 (తాకట్టు దస్తావేజు) దీని చెల్లు దస్తావేజు నెం.979/2013 మరియు ద.నెం.5665/2016 (చెల్లు రశీదు) ఒరిజినల్స్ ది.01-02-2023న గుంటూరు జిల్లా రిజిస్ట్రారు ఆఫీసు ఆవరణలో పోయినవి. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికినా, సదరు ఆస్తిపై విషయమై గానీ మరియు దస్తావేజుల విషయమై గానీ ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ ఈ ప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 7 రోజులలోగా తెలియజేయగలరు.
సయ్యద్ ఆసిఫ్ అలీ
అడ్వకేట్, కోబాల్డ్‌పేట, గుంటూరు.
సెల్‌నెం.9394155522

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

గోదా జాన్‌పాల్‌కు సత్కారం

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : దళిత, పేద వర్గాలకు అందించిన సేవలకు గాను హెచ్ఎస్‌సి(యూఎస్‌ఏ) యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ పొందిన మాల మహానాడు నేత గోదా జాన్ పాల్‌కు వినుకొండ నియోజకవర్గం మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభకు కొండ్రు విజయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దళిత, పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం జరిపే జాన్ పాల్‌కు గౌరవ డాక్టరేట్ లభించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో సమాజంలో కులం మతం పేరిట జరిగే దోపిడీని దుర్మార్గాలను అరికట్టేందుకు జాన్ పాల్ మరింత పట్టుదలతో కృషి చేయాలని వారు కోరారు. జాన్ పాల్ మాట్లాడుతూ దళిత, పేద వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న తనకు డాక్టరేట్ లభించడం సంతోషకరంగా ఉందన్నారు. తనపై బాధ్యతను మరింత పెంచినట్లు అవు తున్నారు. పేదలు, దళితుల పక్షాన పోరాటాలను మరింత ముందుకు తీసు కెళ్తానని ఈ సందర్భంగా తెలిపారు. నియోజకవర్గ ప్రచారా కార్యదర్శి వి.విజయేందర్ రావ్, గౌరవ అధ్యక్షులు కె.కృపారావు, పట్టణ అధ్యక్షులు బేతం దేవానంద్, రఘు, కనమల అంకరావు, ప్రకాష్, ఏసురత్నం, పి.వెంకట్రావు, కె.కమలాకర్ రావు, నాగేశ్వరరావు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ వైవీ రావు సంతాప సభ

విశాలాంధ్ర-వినుకొండ: ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఏపీ జేఏసీ అమరావతి జనరల్ సెక్రటరీ కామ్రేడ్ వైవి రావు సంతాప సభ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైవి రావు ఎర్రజెండా నీడలో అంచెలంచెలుగా ఎదిగి ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతిష్టను ఏపీ జేఏసీ అమరావతి 101 సంఘాలను ఏకతాటి మీద నడిపించిన వ్యక్తి అటువంటి వ్యక్తిని కోల్పోవడం యూనియన్‌కు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కెహెచ్ బాబు, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్.కే ఖాజా డిపో అధ్యక్షులు డిజి విన్సెంట్, కార్యదర్శి పి.సాంబశివరావు, కరిముల్లా, గణపవరం శ్రీను, బాబురావు, పిల్ల శ్రీనివాసరావు, టీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పరీక్షలు రాయాలి: ఎంఈవో

విశాలాంధ్ర-శావల్యాపురం : పదో తరగతి విద్యార్థులు మోటివేషనల్ స్పీకర్ మొగిలి సుభాష్ చెప్పిన అంశాలను నమోదు చేసుకొని ప్రణాళికలతో పరీక్షలు రాయాలని తద్వారా మంచి మార్కులతో ర్యాంక్ సాధించాలని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు అన్నారు. బీద చేంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పది విద్యార్థులకు వేల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రేరణ శిక్షణా తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడంతో పాటు నోట్ చేసుకోవాలన్నారు. ప్రేరణ తరగతుల స్పీకర్, గిన్నిస్ రికార్డు హోల్డర్ మొగిలి సుభాష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి దశలో అతి ముఖ్యమైన దశ అని, లక్ష్యాలను నిర్ణయించుకొని సాధన చేయాలన్నారు. హెచ్ఎంలు అనిత, విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, బీద చేంజ్ సంస్థ సభ్యులు పాపసాని సురేష్, చిన్నకొండ మల్లిఖార్జునరెడ్డి, చుండూరి హేమంత్ కుమార్, తమ్మినేని బ్రహ్మారెడ్డి, కొర్ని విజయబాస్కర్ రెడ్డి, ముండ్లమూరి అవినాష్, పొత్తూరి పూర్ణ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : విద్యార్థుల లక్ష్యం పెద్దగా ఉన్నప్పుడే విజయం దగ్గరవుతుందని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య అన్నారు. మండల కేంద్రమైన నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటుగా మండలంలోని ములకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్స్ ఎంపీపీ, జడ్పీటీసీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్‌ను అందజస్తారని ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ జిలాని భాష, తహశీల్దార్ మధుబాబు, మండ ల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, ములకలూరు సర్పంచి కంచర్ల బాబు, నూజెండ్ల సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణమ్మ, శ్రీలతాదేవి, పీఎంసీ చైర్మన్‌లు వంగూరి ప్రసాదు, సూరాబత్తిన వీరయ్య, సోమేపల్లి చిన్న రాములు, బొడ్డుపల్లి చిన్న కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లాభాదాయకంగా ఉద్యాన పంటల సాగు

విశాలాంధ్ర-యడ్లపాడు : ఉద్యానవన పంటల సాగు లాభదాయకంగా ఉన్నదని వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు. పంట మార్పిడి పద్ధతిలో భాగంగా మండలంలోని వంకాయలపాడు గ్రామంలో సాగులో ఉన్న రావుకు చెందిన డ్రాగన్ ఫ్రూట్ పైరును సోమవారం నాగిరెడ్డి తదితరు సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమీషన్ సభ్యులు జె.రామారావు, ఉద్యానవన పంటల ఏడి ఎం.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సాంకేతిక కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, ఉద్యాన అధికారులు నవీన్ కుమార్, కిషోర్ కుమార్, ఏడీఏ మస్తానమ్మ, స్థానిక ఏవో సరిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థూల వ్యవసాయ ఉద్యాన పంటల ఉత్పత్తి జాతీయ స్థూల ఉత్పత్తిలో 10 నుంచి 12 శాతం ఉన్నదన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి సుమారు 1.43 లక్షల హెక్టార్లలో రైతులు ఉద్యానవన పంటల పెంపకం చేపట్టారని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులు, శాస్త్రవేత్తలకు, అధికారులకు అనుసంధానంగా ఈ వ్యవసాయ మిషన్ క్షేత్ర స్థాయిలో పర్యట నలు చేస్తూ పలు నివేదికలను సంబంధితులకు అందజేస్తుందని వివరించారు.

విధేయతకు దక్కిన విజయం..

మర్రి రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవి
నియోజకవర్గానికి రెండు పదవులు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పార్టీ పట్ల విధేయత, అధినేత పట్ల విశ్వాసం.. అనునిత్యం ప్రజలతో మమేకమ వ్వడం, ప్రజా సేవలో గడపటం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ లక్ష ణాలు. ఆయన జిల్లాలోని ప్రత్తిపాడు నియోజ వర్గంలోని తిక్కిరెడ్డిపాలెం గ్రామంలో 15 ఆగస్టు 1957లో మర్రిరామలింగయ్య, హైమావతి దంపతులకు జన్మించారు. హైస్కూల్ వరకు ప్రత్తిపాడులో, పెదనందిపాడులో కామర్స్‌లో డిగ్రీ, గుంటూరు ఏసీ కళాశాలలో లా పూర్తి చేశారు. నా తరువాత చిలకలూరిపేటలో ప్రాక్టీస్ ప్రారంభించి 2003 వరకు న్యాయవాద వృత్తిలో కొనసాగారు. లలితమ్మను 1983 సంవత్సరంలో వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు శ్రీనాథ్, కుమార్తె హిమబిందు ఉన్నారు. తొలినుంచి మేనమామ సోమేపల్లికి రాజకీయల్లో చేదోడు వాదోడుగా ఉంటూ ఎన్నికల సమయాల్లో క్రియాశీలంగా వ్యవహరించేవారు. 2000 సంవత్సరంలో సోమేపల్లి మృతి అనంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టారు.

కాంగ్రెస్ పార్టీలో ఉన్నా ఇండిపెండింట్‌గా విజయం...

రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు ఒడిదుడుకులకు లోనవు తుంటారు. అలాంటి వ్యక్తి గుంటూరు జిల్లా చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్. 2004 సార్వత్రిక ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించారు. 2004లో అప్పటి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ముందుగా సీటు కేటాయించకపోవటంతో చిలకలూరిపేట నుంచి ఇండిపెండెంట్‌గా మర్రి రాజశేఖర్ పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ అధిష్ఠానం చివ రగా తన మద్ద తును మర్రి రాజశే ఖర్‌కు ప్రకటిం చింది. దీంతో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు బరిలో ఉన్నా ఇండిపెండెంట్‌గా ఆయన విజయం సాధించారు. అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి విధేయుడుగా ఉంటూ ఆయన మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన వైఎస్సార్‌సీపీలో చేరారు. తొలి నుంచి జగన్ వెంటే నడిచారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆ క్రమంలో వచ్చిన ఉప ఎన్నికల్లో జిల్లాలో రాజీనామా చేసి తిరిగి పోటీ చేసిన వారి గెలుపులో కీలక పాత్ర పోషించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసినప్పటికీ ఓడారు. ఆ తర్వాత 2019లో మరోసారి టికెట్ వస్తుందని భావించారు. కానీ అనూహ్యంగా విడదల రజనికి కేటాయించారు జగన్. ఈ క్రమంలోనే జగన్ అప్పట్లో జరిగిన బహిరంగ సభలో చిలకలూరిపేట నుంచి విడదల రజినిని గెలుపించుకోవాలని, సీటు త్యాగం చేసిన మర్రి రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ సీటు కేటాయించి మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఎప్పుడు మండలి ఎన్నికల ప్రస్తావన వచ్చినా కూడా ముందుగా మర్రి రాజశేఖర్ పేరు తెరపైకి వచ్చేది. కాని ఎమ్మెల్సీ పదవి దక్కేది కాదు. అభిమానులు నిరాశతో మునిగిపోయేవారు. అయితే ప్రస్తుతం శాసనమండలి సభ్యుడిగా ఎమ్మెల్యేల కోటాలో మర్రి రాజశేఖర్ పేరు ప్రకటించారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన విడదల రజిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగా ఉండగా, తొలి సారిగా చిలకలూరిపేటకు చెందిన మర్రి రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవి దక్కింది. దీంతో చిలకలూరిపేటకు మంత్రి, ఎమ్మెల్సీ పదవులు లభించినట్లైంది. మర్రి రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరు ప్రకటించగానే మర్రి రాజశేఖర్ అభిమానుల్లో ఆనందోత్సవాలు పెల్లుబిక్కాయి. నియోజకవర్గంలోని పలు చోట్ల అభిమానులు స్వీట్లు పంచుకొన్నారు. రోడ్లపైకి వచ్చి జై మర్రి, జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. సోమవారం నరసరావు పేట కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం కొన సాగింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 127 వినతులను స్వీకరించారు. పల్నాడు జిల్లా దుర్గి మండలం, ఆత్మకూరు గ్రామానికి చెందిన చప్పాల తిరుపతమ్మ, బెల్లం కొండ మండలంకు చెందిన వసంతపు జగన్నాధంలు తమకున్న పొలాన్ని ప్రభుత్వం రికార్డుల్లో 22/ఎ గా నమోదు అయ్యిందని వెంటనే తొలిగించాలని కోరగా వెంటనే ఆ సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చే వారికోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి నరసరావు పేట పట్టణానికి చెందిన అయ్యప్ప స్వామీ ఆలయ అధ్యక్షులు గోపి దంపతుల పేరున సుమారు 250 మందికి ఉచిత అన్నదానం నిర్వహించారు.

నియామకపత్రాలు అందజేత

పల్నాడు జిల్లాలో నవోదయం ద్వారా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ సోమవారం కలెక్టర్ శివ శంకర్ లోతేటి నియామక పత్రాలను అందజేశారు. ఇటీవల నవోదయం ద్వారా పలువురు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన ధరఖాస్తుల్లో సల్లగుండ్ల బాల, బాలికల వసతి గృహంలో వాచ్ మెన్‌లుగా ఇద్దరినీ, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగానికి ఒకరిని నియమిస్తూ నియామక పత్రాలను స్పందన హాల్‌లో అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో చల్లగుండ్ల బాల, బాలికల వసతి గృహంలో వాచ్‌మెన్‌గా జాలాది కమల, నరసరావు పేట అంధుల వసతి గృహంలో వాచ్‌మేన్‌గా నక్క సుభాషిణి, ఆఫీస్ సబార్డ్ నేట్‌గా గుండు మణికంఠ ఉన్నారు. ఎంపికైన ఉద్యోగులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను పరిష్కరించిన కలెక్టర్‌కు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, చిన్నారులు, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త ధన్యవాదాలు తెలిపారు.

అధికారులకు అభినందనలు

విశాలాంధ్ర-నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవాన్ని విజయవంతం చేసిన రెవిన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులను, సిబ్బందిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమారు 20 లక్షల మంది కొటప్పకొండ తిరునాళ్లకు వచ్చారని, అధికారులు, పోలీసులు భక్తులకు ఎక్కడా ఏలాంటి ఇబ్బందులు జరగకుండా ఎక్కడి కక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టారని అన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు చేపట్టిన చర్యలను అభినందించారు. కూలైన్‌లలో స్వామి వారి దర్శనానికి వెళ్ళేవారికి మంచినీరు, పులిహోర ప్యాకెట్లు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. సహకరించిన స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ప్రకటించిన ఈ తిరునాళ్ల మహోత్సవంలో అక్కడక్కడ చిన్న చిన్న సమస్యలు ఏర్పడి ఉండవచ్చునని వీటిని ప్రతిపక్షాల నాయకులు గోరంతను కొండతలుగా చేసి ప్రచారం చేయడం తగదన్నారు. ఇప్పటికే పోలీసులు, కొందరిపై కేసులు నమోదు చేశారని ఎక్కడో ఎవరో ఏదో చేస్తే తమపై బురదచల్లటం ప్రతిపక్షానికి ఆనవాయితీగా మారిందన్నారు. కోటప్పకొండ తిరునాళ్ల సక్సెస్ మీట్ త్వరలో నిర్వహిస్తామని, విజయవంతానికి కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సన్మానిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అన్నారు.

కోటప్పకొండ హుండీ ఆదాయం రూ.1.73 కోట్లు

విశాలాంధ్ర-నరసరావుపేట: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ప్రాంగణంలో లెక్కింపు కార్యక్రమం జరిగింది. మహా శివరాత్రి పండుగ పురస్కరించుకొని గడిచిన మూడు రోజులకు గాను రూ.1,73,67389 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణా ధికారి వేమూరి గోపి తెలిపారు. బంగారం 1.950 మిల్లి గ్రాములు, వెండి 367.600గ్రాములు వచ్చినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఏడీసీ చంద్రకుమార్, డిసి చంద్రశేఖర్ రెడ్డి, డీఈవో సత్య నారాయణ రెడ్డి పర్యవేక్షించారు.

సత్రశాల బాధితుడు మృతి

విశాలాంధ్ర-రెంటచింతల : శివరాత్రి సందర్భంగా పుణ్యక్షేత్రమైన సత్రశాలలో ప్రభను నిర్మిస్తున్న కార్మికుడు చనిపోయినట్లు ఎస్సై సమీర్ బాషా తెలిపారు. పోలీసులు తెలిపిన ఘటనా వివరాలిలా ఉన్నాయి. జెట్టిపాలెంకు చెందిన భక్తుల విరాళాలతో శనివారం నిర్మిస్తున్న విద్యుత్తు ప్రభపైకి ఎక్కిన గురజాల మండలం గంగవరంకు చెందిన పేరుపోగు శ్యాంకుమార్(23) కర్రలు విరగటంతో కింద పడ్డాడు. వెంటనే జెన్కో అంబులెన్స్‌లో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు అక్కడి నుంచి నర్సరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై వెల్లడించారు. శ్యాంకుమార్ అవివాహితుడు. తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రూ.10 లక్షల నిధులు దారి మళ్లింపు

డ్వాక్రా సభ్యుల ఆందోళన

విశాలాంధ్ర-యడ్లపాడు: తిమ్మాపురం గ్రామానికి చెందిన బ్లేస్సి, అశ్విత పేర్లు కలిగిన రెండు డ్వాక్రా సంఘాల నుండి పది లక్షల 43 వేల రూపాయల నిధులను యానిమేటర్ దారి మళ్లించడం సంచలనం కలిగించింది. రుణాలు చెల్లించాలని బ్యాంకు నుండి నోటీసుల అందుకున్న సంఘ సభ్యులు బిత్తర పోయి సోమవారం యడ్లపాడు యూనియన్ బ్యాంక్‌కు వచ్చి నిధులు దారి మళ్ళించినట్లు తెలుసుకున్న సభ్యులు బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. నోటీసులు అందుకున్న సభ్యులు సోమవారం బ్యాంకుకు వచ్చి నిధులు దారి మళ్ళించినట్లు తెలుసుకున్నారు. యానిమేటర్ వనజ సంఘ సభ్యులకు తెలియకుండా నిబంధనలకు విరుద్ధంగా మరొక ఐదుగురు కొత్త సభ్యులతో రెండు సంఘాలకు రెండు ఖాతాలను ప్రారంభించిందని ఏపీఎం తెలిపారు. తమను, బ్యాంకును తప్పుదారి పట్టించి 10 లక్షల 43 వేల రూపాయలను డ్రా చేసినట్లు స్పష్టం చేసారు. సమగ్ర విచారణ అనంతరం నిందితులపై తగిన చర్యలు తీసుకొంటామని ఏపీఎం తెలిపారు. కాగా ఈ భారీ నిధుల మళ్లింపు గతంలో ఎన్నడూ లేకపోవడంతో పెను సంచలనంగా మారింది. గ్రామాల్లోని డ్వాక్రా సంఘ సభ్యులు పలువురు తమ రుణాలను, బ్యాంకు ఖాతాలను పరిశీలించుకోవడం గమనార్హం.

మనది సంక్షేమ జెండా కావాలి...

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ సాయం అందించడమే లక్ష్యంగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడులోని షాదీఖానాలో నిర్వహించిన గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రజా సంక్షేమమే మన జెండా అయితే... మన గెలుపే ప్రజల అజెండా అవుతుందని చెప్పారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు అందరూ.. ప్రతి ఇంటికీ వెళ్లాలని చెప్పారు. గత ప్రభుత్వ తప్పులను తెలియజేయడంతో పాటు మన ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వారికి వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ పెదకూరపాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రయత్నించాలన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబుకు హామీలు ఇవ్వడమే తప్ప.. అమలు చేయడం చేతకాదన్నారు. కానీ ఇచ్చిన హామీలలో 95 శాతానికి పైగా అమలు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కాలర్ ఎగురవేసి చెప్పాలన్నారు. మార్చి 18 నుంచి వలంటీర్లు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏదా సామిరెడ్డి, బెల్లంకొండ మీరయ్య, మాగులూరి అనిల్ కుమార్, వైసీపీ కన్వీనర్ మస్తాన్ షరీఫ్, జిల్లా వైసీపీ నాయకులు నర్సిరెడ్డి, భయంకర సుభాని, బొచ్చు హనుమంతరావు, బత్తుల కోటేశ్వరరావు, రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధి వైసీపీ లక్ష్యం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల కేంద్రమైన అచ్చంపేటలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అవ్వ తాత అక్క అంటూ కలుపుకొని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల అభివృద్ధి దిశగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని శంకర్రావు అన్నారు. 2024లో తనకు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు కావాలని అన్నారు. నియోజవర్గంలో ఏ ప్రభుత్వంలో చేయని పథకాలు అభివృద్ధి వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు విజయ ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ రామా నాయక్, నెల్లూరు చంద్రబాబు, సాయి రెడ్డి, అల్లా బక్షి, బాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు తరలిన పార్టీ శ్రేణులు

విశాలాంధ్ర-బొల్లాపల్లి : వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు జన్మదిన వేడుకలకు బొల్లాపల్లి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ బొల్లాపల్లి మండల కన్వీనర్ మట్టి రాజయ్య నాయకత్వంలో మండలానికి చెందిన ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఇటువంటి మరెన్నో జన్మదిన వేడుకలు కార్యకర్తల మధ్య జరుపుకోవాలని వారు కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పుట్టినరోజు వేడుకలు సోమవారం స్థానిక బొల్లా కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కార్యకర్తలు ఏర్పాటుచేసిన భారీ కేకును ఆయన కట్ చేశారు. తొలుతగా పట్టణంలో మైనారిటీ నాయకులు పి.ఎస్.ఖాన్ అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ గజమాలను ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు వేసి శుభాకాంక్షలు తెలిపి భారీ ర్యాలీతో కారంపూడి రోడ్డులో ఉన్న బొల్లా కళ్యాణ మండపం వద్దకు తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు చేరుస్తున్నామని అన్నారు. పట్టణంలో గతంలో జరిగిన అభివృద్ధి నేడు జరిగిన అభివృద్ధి చూడాలన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య లేదన్నారు. నియోజకవర్గంతో పాటు పట్టణ అభివృద్ధే ధ్యేయమన్నారు. ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకే పలు చోట్ల ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు.

శావల్యాపురం : ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదిన వేడుకలను మండలంలోని ఘంటవారిపాలెం గ్రామానికి చెందిన తేలప్రోలు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన 40 కేజీల బారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు అభిమాన నేతను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవితంలో కొన్ని మధురానుభూతులు ఎప్పటికీ మరిచిపోలేమని, మీరు చూపించే ఆప్యాయత కూడా అలాంటిదేనన్నారు. భగవంతుడి ఆశీస్సులు, ప్రజల అండదండలతో నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కార్యకర్తలకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపు యువసేన అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు, మండల వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు మల్లిశెట్టి నరేష్, వైసీపీ నాయకులు గుత్తా కోటేశ్వరరావు, స్వర్ణాల వెంకట్రావు, తూమాటి కబ్బయ్య, తేలప్రోలు రవీంద్రబాబు, వడ్రాణం నాగేశ్వరరావు, పోతుల వెంకటేశ్వర్లు, తేలప్రోలు గౌతమ్, రంతు శివ, శ్రీకాంత్, మారిశెట్టి శివరామ్ ప్రసాద్, చిలుకూరి లక్ష్మీనారాయణ, బాలంకుందు దేవిసింగ్, పుట్టా అశోక్, విధిరావు, పుట్టా శేషాద్రి, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమరలింగేశ్వర స్వామి రథోత్సవం

విశాలాంధ్ర-అమరా వతి : ప్రముఖ పుణ్య క్షేత్రమైన అమరావతి లోని మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ అమరలింగేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు, నర్సరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. కొద్దిదూరం భక్తులతో కలిసి రథాన్ని లాగారు. రథోత్సవంలో ప్రజాప్రతినిదులు వేలాది మంది భక్తులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పీటీజీలో సామాజిక న్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-మాచర్ల : సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధుబాబు ఆధ్వర్యంలో సోమవారం వీపీ సౌత్‌లోని పీటీజీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్ర మంలో జడ్జి మధుబాబు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను నిర్మూలించి సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు వర్గ బేధాలు లేకుండా కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు చట్టం, న్యాయ వ్యవస్థల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. వివక్షత లేని సమాజం కోసం అందరూ పాటుపడాలన్నారు. ప్రభుత్వ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసిందని, వాటి ద్వారా అందరూ ఆర్థిక, సామాజిక, దేశాభివృద్ధి కోసం ప్రజలు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని వసతి గృహం, మౌలిక వసతులు, టాయిలెట్లను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనువాస నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు జగన్ మోసం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయి బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తానని పాదయాత్రలో వాగ్దానం చేసి, మాట తప్పిన ముఖ్యమంత్రి ఐదు సంవత్సరాలుగా నాయి బ్రాహ్మణులకు ఎటువంటి పార్టీ పదవి గాని, రాజకీయ ప్రాధాన్యత గాని నామినేటెడ్ పదవుల్లో గాని అవకాశం కల్పించకుండా నాయిబ్రాహ్మణ జాతిని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ విమర్శించారు. రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కిన వైసీపీను గద్దెదించడంలో వెనకడుగు వేయబోమని అన్నారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం : 272/18

బిట్వీన్ :
దొండపాటి వెంకటేశ్వర్లు - వాది
మరియు
లింగా పిచ్చమ్మ మరియు వగైరాలు - ప్రతివాదులు

4వ ప్రతివాది : లింగా అనూష D/o. లేటు వెంకటేశ్వర్లు, C/o. లింగా పద్మావతి డోర్ నెం : 28-6-138 ముటుకూరు (Po). దుర్గి మండలం పల్నాడు జిల్లా.

పై నెంబర్లు దావాను వాది ప్రతివాదులపై ప్రామసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తము దావా దాఖలా చేయగా సదరు దావాలో I.A.996/18 నందు 4వ రెస్పాండెంట్‌నకు మరియు దావాలో 4వ ప్రతివాదికి సమన్లు జారీ చేయునిమిత్తము కోర్టు వారు ది.2-3-2023వ తేదీనకు వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసి యున్నది. లేనిచో పరోక్షమందు తీర్మానించబడును.

ఆచంట శ్రీనివాసరావు
వాది తరపు అడ్వకేట్, గురజాల
సెల్ : 9849031191

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
O.S. NO : 381/2019

బిట్వీన్ :
చిలంచర్ల నరసింహారావు - వాది.
వర్సెస్,
1) మంజుల సత్యనారాయణ, 2) మంజుల నాగరాజు, 3) మంజుల శ్రీను
4) మంజుల శ్రీను -ప్రతివాదులు.
To,
ప్రతివాది నెం.4 : మంజుల శ్రీను తండ్రి మార్కండేయులు, పాత వడ్డెరపాలెం, R/o. మాచర్ల, పల్నాడు జిల్లా (ప్రస్తుతం గుంటూరు జిల్లా).

పై దావా సందు ప్రతివాది నెం.4 అయిన మీరు హాజరగుటకు ది.17-3-2023న వాయిదా ఉన్నది. ది.17-3-2023 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగాను లేదా అడ్వకేట్ ద్వారా గాని పై దావాకు గాను మరియు అందు దాఖలు కాబడిన పిటిషన్లకు గాను మీ ఆక్షేపణలు తెలియజేయని ఎడల మీ పరోక్షమందు తీర్మానింపబడునని తెలియజేయడమైనది.
వాయిదా తేదీ.17-3-2023.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గట్ల సత్యనారాయణ రెడ్డి
వాది తరపు న్యాయవాది
మాచర్ల - 522426.

సమను ప్రకటన
మహారాజశ్రీ మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO : 271/2022

బిట్వీన్ :
సోమిశెట్టి రామకృష్ణ - వాది.
వర్సెస్,
1) తెల్లబాటీ శారద,
2) తెల్లబాటీ అంజలి - ప్రతివాదులు.
TO,
తెల్లబాటీ అంజలి D/o. కొండలు(లేటు), హిందూ. (R/o 10-153, ఓల్డ్ టౌన్, 17వ వార్డు, మాచర్ల టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా)

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు నీకు ఎన్ని మార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున వాయిదాను ది. 17-03-2023కు, మీ యొక్క హాజరు నిమిత్తం వేసినారు. కావున మీరు పై తేదీన పై కోర్టులో ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై నీకు గల ఆక్షేపణలను తెలియపరచుకొనవల్సింది. లేనియెడల దావా ను నీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియపరచడమైనది.
వాయిదా తేదీ. 17-3-2023.

జే నాగేశ్వరరావు బీకాం.బిఎల్
వాది తరపు న్యాయవాది
రామా టాకీసు వద్ద, మాచర్ల - 522426
సెల్ నెం. 9490450973.

ప్రకటన

షెడ్యూల్ దాఖలు ఆస్తిని ది.21-9-1949 న వీర్నాల కొండయ్య గారి కుమారుడు పిచ్చయ్య గారు స్వార్జితముగా సంపాదించుకొని పూర్తి హక్కు లతో అనుభవించుచు షుమారు 30 సంవత్సరముల క్రితము మరణించినారు. వీర్నాల పిచ్చయ్య మరణానంతరము పిచ్చయ్య గారి భార్య వీర్నాల చౌడమ్మ వీరి ఏకైక కుమారుడు వీర్నాల కొండలు షెడ్యూలు ఆస్తిని ఉమ్మడిగా అనుభవించుచున్నారు. ది.21-11-2011న వీర్నాల చౌడమ్మ గారు తన కుమారుడు అయిన వీర్నాల కొండలు గారి పేరు దఖలు దస్తావేజు వ్రాసి మాచర్ల సబ్ రిజిస్టార్ ఆఫీసులో దస్తావేజు నెంబరు 4603/ 2011గా రిజిస్టరు చేసి ఉన్నారు. షెడ్యూలు ఆస్తిని వీర్నాల కొండలు తండ్రి పిచ్చయ్య గారు పూర్తి హక్కులతో అనుభవించుచున్నారు కనుక షెడ్యూలు ఆస్తిని గురించి ఎవరికి అయినా ఎట్టి అభ్యంతరములు ఉన్న ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపు ఈ క్రింది వారికి లిఖిత పూర్వకంగా గాని లేక ఫోను ద్వారా గాని తెలియ చేయగలరు.
షెడ్యూలు : నరసరావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, మాచర్ల సబ్ రిజిస్టార్ ఇలాకా మాచర్ల మున్సిపాలిటీ ఇలాగా 6వబ్లాక్ డోర్ నెం. 6-56, సర్వే నెం: 677/4 ఎసెస్ మెంట్ నెంబర్ 1022000773 గల ఇంటికి హద్దులు : తూర్పు : అడికె కోటేశ్వరరావు స్థలం, దక్షిణం : శీలం రామకృష్ణ లోగిలి, పడమర : బజారు, ఉత్తరం : ఉప్పుతోళ్ల గోవిందు ఇంటి తాలూకా ప్రహరీ గోడ.

గంధ్రకోట శ్రీనివాసరావు న్యాయవాది.
సెల్ : 9440207625
మాచర్ల - 522426.

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో స్పందన అర్జీలను గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంచార్జీ కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రభుత్వం విధించిన సమయంలోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై పదే పదే వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివ జ్యోతి, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలీమ్స్, డి.ఎం శ్రీలక్ష్మీ, డి.ఎం.హె.ఓ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి తెలిపారు. సోమవారం తోటవారిపాలెం పంచాయతీలో కావూరి బాజిరెడ్డి అనే రైతు స్ప్రింక్లర్స్ పైపులకు ఆర్బికేలో దరఖాస్తు చేయగా ఫీల్డ్ వేరిఫికేషన్‌కి వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి ఆ భూమిలో వ్యవసాయ బోరు ఉందా లేదా భూమి అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించి స్పింక్లర్లు మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ కింద రైతులకు స్ప్రింక్లర్స్ పైపులు ఇస్తున్నారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో సుమతి, ఆర్బికే అధికారి ప్రసన్న స్పింకులేర్స్ ఫీల్డ్ ఆఫీసర్ లోకేష్, రైతులు పాల్గొన్నారు.

మూడు రోజులు తాగునీరు బంద్

విశాలాంధ్ర - చీరాల : రైల్వే శాఖ కొత్తగా ఏర్పాటు చేయనున్న మూడవ రైల్వే ట్రాక్ పనుల్లో భాగంగా పురపాలక సంఘ పరిధిలో ఉన్న తాగునీటి పైపులైన్లను మార్చాల్సి ఉందని కమిషనర్ ఏసయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 5, 11 నుంచి 22వ వార్డులోని ప్రజలకు 23నుంచి 25 తేదీ వరకు మూడురోజుల పాటు ఎన్ఆర్ అండ్ పీఎం, గొల్లపాలెంలోని మంచినీటి ట్యాంకుల నుంచి మంచినీటి సరఫరా చేయరన్నారు. అనంతరం యథావిధిగా మంచినీటిని సరఫరా చేస్తామని ప్రజలు గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు.

పది విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపిపి డి.లలితకుమారి, జడ్‌పిటిసి సభ్యురాలు తిరువీదుల ఉదయ భాస్కరి అన్నారు. మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 79 మంది విద్యార్థులకు పౌష్టికాహారాన్ని సోమవారం పాఠశాల ఆవరణలో ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌటూరి లక్ష్మీ, ఎంపిటిసిలు వాకా వెంకట నారాయణ, కుమారిభాయి, ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకనుగుణంగా విద్యార్థులు రాణించాలి

విశాలాంధ్ర - మార్టూరు : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్‌ని అభివృద్ధి చేసుకోవాలని రాయల్ జూనియర్ కాలేజ్ డైరెక్టర్ వీరగంధం శ్రీనివాస రావు అన్నారు. సోమవారం కాలేజ్ 24 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రావి అంకమ్మ చౌదరి శ్రీనివాస విద్యాసంస్థల ప్రధానో పాధ్యాయులు సురేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరిం చాయి. గత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యా ర్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస విద్యాసంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేసుకోవాలి



విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి కోరారు. మండలంలో 2857 మంది రైతుల ఈ కేవైసీ పూర్తి చేశామని, ఇంకా సుమారు 600 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి కాలేదన్నారు. ఈ కేవైసీ పూర్తి చేయని పక్షంలో, ఈక్రాప్ క్రింద పంట బీమా వర్తించదని, మద్దతు ధర, పంట నష్టం వర్తించదని తెలిపారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పిట్టలవానిపాలెం మండలం గోకరాజుపాలెంకు చెందిన నాగిరెడ్డికి ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. ఈ నేపథ్యంలో బాపట్ల టీడీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ బాధితునికి ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

రేపు సాధారణ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్. నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరనాథబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులతో మండల అభివృద్ధికి సంబంధించి శాఖ పరమైన అంశాల పై సమీక్ష జరుగుతుందని చెప్పారు.కావున మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ప్రజా సంక్షేమమే జగన్ లక్ష్యం: ఎంపీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో సర్పంచ్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ మోహన్ రెడ్డి నూటికి నూరు శాతం నెరవేర్చరని చెప్పారు. నవరత్నాలులోని సంక్షేమ పథకాలు దేశంలోను అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నా యని అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తు రాష్ట్రంలో సూపరిపాలన అందిస్తు ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. కులం, మతం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తు అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధి దారుల ఖాతాలోనే నగదు జమ చేస్తూ పారదర్శకంగా సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి చేరువ చేస్తు న్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి హరనాథ్ బాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీడీవో ఎస్.నాగలక్ష్మి, ఎంపీటీసీలు నాజర్ ఖాన్, ఎల్ఎస్ఆర్, గోపాలకృష్ణ, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్, సచివాల యం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన: డీఈఓ

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 23వ తేదీన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె రామారావు తెలిపారు. డీఈవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బాపట్ల పబ్లిక్ స్కూల్ ఆవరణంలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులు 5 అంశాలతో వైజ్ఞానిక ప్రదర్శన చేయ నున్నారని తెలిపారు. జిల్లాలోని 25 మండలాల నుండి పర్యావరణహిత పదార్థములు, ఆరోగ్యము- పరిశుభ్రత, సాఫ్ట్వేర్ యాప్, పర్యావరణ వాతావరణ మార్పులు, గణిత నమూనాలు అనే అంశాలతో ప్రదర్శన ఇవ్వను న్నారన్నారు. 5 అంశాలతో ఒక్కొక్కటి చొప్పున ఎంపిక చేయబడిన ప్రాజెక్టులు ప్రదర్శిస్తారన్నారు. జిల్లాలోని 25 మండలాల నుండి మొత్తం 125 ప్రాజెక్టులు ప్రదర్శనకు హాజరుకానున్నాయని ఆయన తెలిపారు. జిల్లాలోని 9 అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుండి కూడా 18 ప్రాజెక్టులు ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నయన్నారు. జిల్లాస్థాయి ప్రదర్శ నలో 10 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 17,439 మంది విద్యార్థులు ఏప్రిల్‌లో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలి పారు. విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా 103 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం జనవరి 19వ తేదీ నుంచి విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రతిరోజు 20 మార్కులతో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8.15 నుండి 9.15 గంటల వరకు, సాయంత్రం4.15 నుండి5.15 వరకు వేరు వేరు సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఉప విద్యాశాఖ అధికారి జి.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీల చోరీ కేసుల్లో ముద్దాయి అరెస్ట్

విశాలాంధ్ర-పర్చూరు: ట్రాక్టర్ ఇంజను తీసుకొని పగలు రెక్కి నిర్వహించి రాత్రి సమయంలో చోరీలు చేస్తున్న బాపట్ల మండలం సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఇంజం రామంజనేయరెడ్డిని పర్చూరు వైజంక్షన్ సమీపంలో సోమవారం వాహనాలు తనిఖీ సమయంలో అనుమానస్పదంగా ఉండగా పట్టుకున్నామని, మరోక ముద్దాయి వెంకటరెడ్డి పరారీలో ఉన్నారని మార్టూరు సిఐ ఫిరోజ్ ఎస్సై చెంచుప్రసాద్‌తో కలిసి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, డిఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మార్టూరు సిఐ ఎస్కేటీ ఫిరోజ్ ఆధ్వర్యంలో పర్చూరు ఎస్సై ఎన్ చెంచుప్రసాద్ మరియు సిబ్బంది ముద్దాయిని పట్టుకుని విచారించగా ప్రకాశం, గుంటూరు, బాపట్లలలో నమోదు అయిన కేసులలో ఆరు ట్రాక్టర్ ట్రాలీలు, ఒక ట్రాక్టర్ ఇంజను దొంగిలించినట్లు నేరం ఒప్పుకోవటంతో వాటిని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనపరుచుకుని ముద్దాయిని అరెస్ట్ చేశామని తెలిపారు. వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. గతంలో ముద్దాయి మూడు సార్లు జైలు జీవితం గడిపారని తెలిపారు. చోరీ కేసులో ముద్దాయిని అరెస్ట్ చేసి వాహనాల రికవరీలో ప్రతిభ కనపరచిన డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐ ఫిరోజ్, ఎస్సై చెంచుప్రసాద్, ఏఎస్సైలు పి.కోటేశ్వరరావు, ఎస్.సురేష్‌రెడ్డి, సిబ్బంది ఎం.బాలశంకరరావు, ఎం.కిరణ్‌కుమార్, హెచ్‌జీ మురళీలను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ రివార్డులు ఇచ్చి ప్రత్యేకంగా అభినందించారు.

యురినరీ బ్లాడర్‌కు గాటు.. బాధితురాలి ఆందోళన

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తుండగా మహిళ యూరినరీ బ్లాడర్‌కు గాటు పడింది. దీంతో గత 14 రోజులగా మహిళ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఏరియా వైద్యశాల సుపర్డెంట్ కె. సిద్ధర్థ తెలిపిన వివరాల ప్రకారం చీరాల మండలం కావూరివారిపాలెం గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రావణి 15రోజులు క్రితం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వచ్చారన్నారు. దీంతో ఆసుపత్రిలో డాక్టర్ షణ్ముకశ్రీ ఆపరేషన్ చేసే సమయంలో యూరినరీ బ్లాడర్‌కు చర్మ బాగా అతుక్కుని ఉండటం వలన యూరినరీ బ్లాడర్‌కు చిన్నగాటు పడిందన్నారు. దీంతో ఆమెను వైద్యుల పర్యవేక్షణలో ఉంచేందుకు ఆసుపత్రిలో ఉంచామన్నారు. బాధితురాలి పరిస్థితి నేను స్వయంగా పరిశీలించానన్నారు. ఇదే విషయాన్ని ఆమె కుటుంబీకులతో పాటు గ్రామ వైద్య సిబ్బందికి తెలిపామన్నారు. యూరినరి బ్లాడర్‌కు అయిన గాటు చాలా చిన్న సమస్య మాత్రమే అని ఎటువంటి ప్రమాదం లేదన్నారు. వైద్యుల పర్యవేక్షణలో ఉంచేందుకే ఆసుపత్రిలో ఉంచామని మంగళవారం ఆసుపత్రి నుంచి డిచార్జ్ చేయనున్నామన్నారు. భవిష్యత్తులో కూడా ఎటువంటి ప్రమాదం ఉండదని సూపర్‌డెంట్ సిద్ధార్ధ తెలిపారు. బాధితురాలని జనసేన నాయకులు నామన శ్రీమన్నారాయణ పరామర్శించారు.

డుప్లికేట్ ఓట్లు తక్షణమే విచారించాలి

విశాలాంధ్ర-బాపట్ల: శాసన మండలి ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓట్లను జిల్లా ఎన్నికల అధికారులు తక్షణమే విచారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనస్ ఆదేశించారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓట్లు, ఒకే వ్యక్తి పేర్లు జాబితాలో రెండుచోట్ల నమోదైతే వాటిని విచారించి తొలగించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయాలన్నారు. అలాగే బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటర్లను ఎంపిక చేయాలన్నారు. బ్యాలెట్ పత్రాలు పింక్ కలర్ లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 23వ తేదీన అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ముఖ్యంగా హైకోర్టు కేసుల్లో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత దస్త్రాలు పునఃపరిశీలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల సర్వీస్ సర్టిఫికెట్ల జారీపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో డూప్లికేట్ ఓటర్లను గుర్తించి విచారణ చేపడుతున్నామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ కె. శ్రీనివాసులు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధ్యాయ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఒకటి డబుల్ ఎంట్రీ కాగా, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించిన జాబితాలో ముగ్గురికి వయస్సు అధికంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి డి.ఆర్.ఓ కె.లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమవ్వాలి: బాచిన

విశాలాంధ్ర-బల్లికురవ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువచేసి వచ్చే ఎన్నికలకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గృహ సారథులు,కన్వీనర్లు పనిచేయాలని శాపు నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణచైతన్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన గృహ సారథులు,కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించి ప్రచార సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు వారి నుండి అపూర్వ సందన లభించిందన్నారు.గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో 98 శాతం హామీలు గడిచిన మూడున్నర సంవత్సరంలో నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రజలు నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి వారు లేక ప్రతిపక్షాలు ఎల్లో మీడియాలు తప్పుడు ప్రచారం చేస్తుందని దుయ్యబెట్టారు.వచ్చే ఎన్నికలలో అద్దంకిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా ఇద్దామనీ,దనికోసం ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పని చేయాలన్నారు.గృహ సారథులు,కన్వీనర్లు వచ్చేనెల 18వ తేదీ నుండి 25వ తేదీ లోపు ప్రతి గృహాన్ని సందర్శించి వారితో మమేకమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి,గత ప్రభుత్వాలకి మన ప్రభుత్వానికి గల తేడాని వివరించాలన్నారు.గ్రామాల్లో ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనీ వారి వివరాలు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి,వైస్ ఎంపీపీ ఇప్పల వెంకటసుబ్బారెడ్డి,మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీను వలి, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు టి.నరేష్ సర్పంచులు ధూళిపాళ్ల బులిరామయ్య,ఏల్చూరిశివపార్వతి హరిబాబు, పసల అంజలి, నాగేశ్వరరావు, జూపల్లి రాఘవరావు, తన్నీరు లేపాక్షివిష్ణు, బండారు వెంకయ్యమ్మ, గురవయ్య, మసిముక్కల లక్ష్మి, మేడ జయలక్ష్మి, ఎం.కుసుమకుమారి రవికుమార్,నాయకులు కే.శంకర్ రెడ్డి,మేడ శివ దుర్గ, జి.సీతారెడ్డి, దివ్య, రామాంజనేయులు, జి.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన వైఎస్సార్ విగ్రహం మళ్లీ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-బాపట్ల: బాపట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించి పట్టణ శివారులో ఏర్పాటు చేశారని ఎక్కడ నుంచైతే విగ్రహం తొలగించారో అదే స్థానంలో తిరిగి ఏర్పాటు చేయాలని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాంద్ర సాంబశివరావు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం తాంద్ర మీడియాతో మాట్లాడుతూ నేటి ముఖ్యమంత్రి సీఎం జగన్మోహన్‌రెడ్డి నాడు బాపట్ల పర్యటనలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారన్నారు. పట్టణానికి నడిబొడ్డున ఏర్పాటు చేసిన విగ్రహాన్ని పట్టణ శివారులతో పెట్టడం అత్యంత హేయమైన చర్య అన్నారు. బాపట్ల జిల్లాకి ప్రధాన కేంద్రంగా ఉన్నటువంటి ఉన్న పట్టణం నడిబొడ్డులో టీడీపీ నాయకులు రెండు ఎన్టీఆర్ విగ్రహాలు పెట్టుకుంటే పట్టణంలో ఉన్న ఒకే ఒక్క వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించి పట్టణానికి బయట పక్కన పెట్టడాన్ని వైసీపీ ప్రజాప్రతినిధిగా తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఎక్కడ నుంచైతే విగ్రహాన్ని తొలగించారో అదే స్థానంలో మార్చి 11వ తేదీన ఉదయం 10 గంటలకు వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించే కార్యక్రమం చేయనున్నామన్నారు. బాపట్ల పట్టణాన్ని జిల్లా కేంద్రంగా అదేవిధంగా బాపట్లను జిల్లాగా చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిజమైన ధన్యవాదాలు తెలియజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. పట్టణంలోని ప్రధాన సెంటర్ గడియార స్తంభం సెంటర్, పాత బస్టాండ్ లేదా కొత్త బస్టాండ్ ఏరియాలలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా వైఎస్ఆర్ సర్కిల్‌ను కూడా ఏర్పాటు చేయాలని కోరుతామన్నారు. మున్సిపల్ ఆఫీస్ దగ్గర నుండి ర్యాలీగా వెళ్ళి జమ్ములపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పాదాలకు వినతి పత్రాన్ని ఇచ్చే విధంగా కార్యక్రమాన్ని రూపొందించటం జరిగిందన్నారు. బాపట్ల నియోజకవర్గం లోని వైఎస్ఆర్ అభిమానులను, జగనన్న సైనికులను, వైఎస్సార్సీపీ నాయకులను కార్యకర్తలను అందరితో కలిసి బాపట్ల పట్టణంలో వైఎస్ఆర్ విగ్రహ స్థాపన కొరకు, వైఎస్ఆర్ సర్కిల్ ఏర్పాటుకు త్వరలోనే అందరు పెద్దలను కలిసి వైఎస్ఆర్ విగ్రహాల సాధన కమిటీని తయారు చేసుకొని కార్యాచరణ ప్రకటించనున్నట్లు తాంద్ర సాంబశివరావు తెలిపారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

బలహీన వర్గాల అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ కృషి

విశాలాంధ్ర - రేపల్లె : బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన నాయకులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. మండలంలోని ఉప్పూడి గ్రామపంచాయతీ పరిధిలోని ఉలుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ స్థానిక నాయకులు ఎంపిటిసి సభ్యులు, సతీష్ ఆర్థిక సహకారంతో గ్రామ పెద్దలు విగ్రహం ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని సమాజా భివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సతీష్ బాబు, సర్పంచి బేబీ రాణీ, నాయకులు ఇమ్మానియేల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల్లో బిందుసేద్యం అలవరచుకోవాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని గుడిపాడు గ్రామంలో గ్రామ స్థాయిలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలలో ఎస్సీ ఎస్టీ రైతులు మల్చింగ్ పద్ధతి, బిందు సేద్యాన్ని అలవర్చుకున్నప్పుడే ఉద్యానవన పంటలలో ఎక్కువ దిగుబడులు తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుందని పి.గుడిపాడు మాజీ సర్పంచ్ రావూరి డేవిడ్ సన్ తెలిపారు. దళిత బహుజన రిసోర్ సెంటర్ ఆధ్వ ర్యంలో పి.గుడిపాడు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వర రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కొరకు ఎన్నో పథకాలను అమలు చేస్తుందని ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంటలలో పోషక లోపాలను గుర్తించడం కోసం రైతులకు భూసార పరీక్షలు చేయించి ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడటాన్ని మరియు సమగ్ర పోషక యాజ మాన్య పద్ధతులను ప్రోత్సహిస్తారని అన్నారు. ప్రతి ఒక్క రైతు వ్యవసాయ పద్ధతులు తెలుసుకోవాలని ఆయన తెలియజేశారు. గ్రామ రైతు సంఘాలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను అందిపుచ్చుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం గ్రామ సంఘ అధ్యక్షురాలు జంగా ఆరోగ్యం, సునీత, మహిళ రైతులు పాల్గొన్నారు.

రథోత్సవం పూజల్లో వేగేశన

విశాలాంధ్ర-బాపట్లరూరల్: మహా శివరాత్రి సందర్భంగా అప్పికట్ల శివాలయం రథోత్సవంలో టీడీపీ నియోజక వర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జరిగిన స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భ్రష్టుపట్టిన వ్యవస్థలు: వేగేశన

విశాలాంధ్ర-బాపట్ల రూరల్: వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయని టీడీపీ నియోజవకర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని అడివి పంచాయితీ పరిధి దానవాయిపేట గ్రామంలో గ్రామస్తులతో గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పార్టీ ఇచ్చిన సర్వే పత్రాలలో నింపి తెలుగుదేశం పార్టీ ద్వారా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ ప్రజల కోసం పని చేయాల్సిన అధికారులను ప్రతిపక్ష పార్టీల మీద కక్ష్య సాధింపు చర్యలకు వాడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ బెదిరింపు ధోరణితో చంద్రబాబు నాయుడు కష్టపడి తీసుకొచ్చిన పరిశ్రమలు ప్రక్క రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రతి ఒక్కరూ కూడా ఇదేమి ఖర్మ అనుకొనే పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ

విశాలాంధ్ర-బాపట్ల: ఫిర్యాదుదారులు పట్ల సహృదయ భావంతో వ్యవహరించి నిర్దేశించిన గడవులోపు సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పిర్యాదుల స్వీకరణ అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎంతో భాదతో సమస్యల పరిస్కారం కోసం పోలీస్ కార్యాలయాలకు వస్తుంటారని తెలిపారు. పిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి సమస్యలను విని సమస్య పరిష్కరం చేస్తామనే భరోసా వారికి కల్పించాలన్నారు. చట్టపరిధిలో విచారణ జరిపి నిర్దిత గడువులోపు ఫిర్యాధుదారుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలుఇతర సమస్యల పరిష్కారం కోరుతూ 34 మంది ఫిర్యాదులు చేశారు. స్పందన సెల్ ఇన్స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన, వైసీపీ నేత కల్లి మాటామంతి

విశాలాంధ్ర-బాపట్ల రూరల్: మండలంలోని నరసాయపాలెం గ్రామంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కోన రఘుపతి వైసీపీ సీనియర్ నేత కల్లి హరినాధ్‌రెడ్డి ల మధ్య మాటామంతి జరిగింది. ఎమ్మెల్యే కోనను కల్లంతో పాటు గ్రామస్తులు పూలమాలలు దృశాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు.